# కథ అడ్డం తిరిగింది

'శ్రీ' అనంతం

అపర్ణ అమ్మమ్మను ముందు ఎక్కమన్నది రిక్షా. తరువాత తను ఎక్కింది. ఎక్కి కూర్చోటంతోటే 'పోనీయ్' అన్నది. అనటమే తరువాయిగా కదిలింది రిక్షా.

"మెయిలు కందించావోయ్" అందించావా అర్ధ రూపాయి ఇస్తాను. లేదూ అందులో సగమే" అన్నది అపర్ణ.

అపర్ణ మొదటి వాక్యానికే అధిక వేగా న్నందుకొన్నది రిక్షా. రెండో వాక్యం ఆమె నోట నుండి వచ్చేటప్పటికి ఆటో రిక్షా అయిపోయింది రిక్షా.

"అమ్మమ్మా! ఆంతా ఎక్కినట్టేగా" అన్నది అపర్ణ తన జాగ్రత్తను తెలియ బరుస్తూ.

"అంతా యెవరే? నువ్వూ నేనేగా" అన్నది అమ్మమ్మ తెల్లబోతూ.

"అదేమి టమ్మమ్మా! మనం నలుగురం. చూడు ఒకటి నువ్వు, రెండు నేను, మూడు నా లెదర్ సూట్ కేస్, నాలుగు నా హేండ్ బ్యాగ్. ఏం! అవునా కాదా?" అన్నది అపర్ణ చేతులు తిప్పుకొంటూ.

"ఇదేం విడ్డూరమే! పెట్టెలూ సంచులూ కూడా మనుషుల్లోనే లెక్కేమిటి? నీకు చదవేస్తే ఉన్నమతీ పోతున్నట్టుంది" అన్నది అమ్మమ్మ.

"నా కసలు మతంటూ ఉందనీ, అది ఇప్పుడు పోతూ పోతూ ఉందనీ, అంగీకరించావు. సంతోషం. కాని, నీ దృష్టిలో అవి మనలో చేరకపోయినా, దేవుడి దృష్టిలో సమానమే. మళ్ళీ వింటున్నావు పురాణాలు, ఎందుకూ? పురాణాలు వింటే నీకు కాస్త మతి వస్తుం దనుకున్నా. నా అంచనా తప్పింది మరి లాభంలేదు." అన్నది అపర్ణ తన తెలివికి తానే సంతోషిస్తూను, నవ్వాపుకొంటోను.

ఉడుకుబోతు తనం అంతా అమ్మమ్మ ముఖంమీదకే వచ్చి కూర్చుంది. కాస్త మాత్రమే వాగ్రూపంలో బయటికి వచ్చింది.

"చాల్లే! నీ చమత్కారానికి సంతోషించాం. అయినా ముసిలి ముండను. నా ముందు నీ చమత్కారం చూపిస్తే నేనేం చెయ్యగలను. రేపు నీ మొగుడి దగ్గర వినియోగించు కాస్త దాచి. ఎవడు రాబోతున్నాడోకాని, పొన్న పువ్వుల్తో పూజచేసుకొ నుంటాడే అమ్మా నీ కోసం. కాస్త 'గాటావా'డైతే ఏమోగాని, మెత్తని వాడైతేనా, మహాప్రభూ వేగాడన్నమాటే నీతో" అన్నది అమ్మమ్మ తన పెద్దతనాన్ని చక్కగా వినియోగించుకొని.

"అమ్మమ్మా! నాకు నీపోలిక కొంచెమే వచ్చిందం టారుగా అంతా! మాతాతయ్య పారిజాతాలతోనూ,మందా రాలతోనూ పూజ చేసుకు నుంటాడు నీ కోసం. అయితే అమ్మమ్మా, మా తాతయ్యను నేను చూడలేదు. లేకుంటే అడిగేదాన్ని. నువు చెప్పు. నీతో వేగలేక పచ్చిగానే ఉండిపోయుంటాడు. అవునా?" అన్నది అపర్ణ, గుడ్లు మిటకరిస్తూ.

"పోవే. నీతో అసలు మాటాడగూడదు" అన్నది అమ్మమ్మ తన ఓటమిని విస్పష్టమైన మాటలతో అంగీక రించటానికి ఇష్టంలేక.

అపర్ణకు నవ్వు ఆగలేదు— నవ్వేసింది. ఎంత వేగంగా పోతున్నా రిక్షావాలా నవ్వాడు. కాని, ఆనవ్వు ఎదుటినుండి చూచేవాళ్ళకే కనపడుతుంది. కనుక అపర్ణకూ కనుపించ లేదు. తానూ ఆ చమత్కార సంభాషణలో ఓ వాక్యం జోడిద్దామనుకొన్నాడు. కాని, నవ్వు నవ్వడితోపాటు ఆ వాక్యాన్ని, కంఠంలోనే స్తంభింపజేశాడు.

అపర్ణకు మెయిలు అందదేమోనన్న ఆదుర్దా అధిక మైంది. అటూ, ఇటూ చూచింది. చెట్లూ, మేడలూ

అన్నీ వెనుకబడిపోతున్నాయి సినిమాలోలాగ. చక్రం వంక చూచింది. ఊచలున్నాయనిపించటంలేదు. "ఈ వేగంలో ముందరి చక్రం ఊడిపోతే తమ పనేంగాను? అమ్మయ్యో" గుండె ఝల్లుమన్నది. తన ఊహకు తానే నవ్వుకొన్నది. కాని, రక్త ప్రవాహ వేగం హెచ్చినందువల్ల ఉబికిన అతని కాలి కండరాలను చూచి ఊరుకొన్నది మనసు ఒప్పక. స్టేషను సమీపించింది. రిక్షాకు డబ్బులిచ్చేసరికి రైలు వచ్చేసింది. టిక్కెట్టు తీసికొని అమ్మమ్మను ఎక్కించి తాను ఎక్కేటప్పటికి తాతలు దిగివచ్చారు.

"అమ్మయ్య అంద దనుకొన్న బండి అందింది. అదృష్టమే. అక్కడికి బండిలేటు. పనుకనే అందింది. ఎక్కడా ఖాళీలేదు.... పోనీ నుంచో వచ్చు.... గోదావరి స్టేషనుకూ నిడదవోలుకూ ఎంత. పట్టుమని పాతిక మైళ్ళు లేవు.

"ఎంత కంగారైంది. కాలేజీనుంచి వచ్చేనో లేదో టెలిగ్రాం సిద్ధం. నాన్న ఎప్పుడూ ఇంతే. ఆయనొక ప్రాప్తకాలజ్ఞుడు. ప్రతిపనీ టెలిగ్రాములమీద నడుపుతాడు. ఆయన మాటలాడటం అంటేనే అదొక చిన్న టెలిగ్రాం. ఆయన నడక పరుగే. ఆయన ప్రయాణాలన్నీ ఎక్స్‌ప్రెస్‌లూ, మెయిళ్ళూ ఉంటేనేగాని కుదరవు. ఆయనకు కోపంవస్తే కార్చిచ్చే.

"అంతా క్షేమం- ఊరికినేలే. అమ్మమ్మతో అందిన బండికి బయలుదేరి రా" అనీ టెలిగ్రాం.

"ఇంతా కంగారుపడి బయలుదేరి వెడితే మళ్ళీ ఏమీ ఉండదు. వడ్లగింజలో బియ్యపు గింజ. చూడాలనిపించినపుడు తాను బయలుదేరి రాకూడదూ. అయినా, రాజమండ్రీ నిడదవోలుల మధ్య టెలిగ్రాములెందుకు? అంతకంటే మనిషే దబ్బునవెళ్ళి రావచ్చుగా. ఏమిటో చాదస్తం.

"ఒక్కొక్కళ్ళకి తమ కెంత తోస్తే అంత. అసలు వాళ్ళ మోస్తరే అంత. నా కాలేజీ చదువు విషయంలో ఎంత రగడ జరిగింది. అమ్మవద్దన్నదని ఆమెతో నెల్లాళ్ళు మాటాడలేదు నాన్న.

"చివరకు అమ్మ, నాకూ చదువుకోవాలనే ఉందని గ్రహించింది. అన్యాయంగా నాన్న వేసిన శిక్షకు తపించింది. తనకు తానే పంపమని బతిమాలింది. అప్పుడుగాని నాన్నకు పట్టుసడలలేదు. అంతా మామూలే ఆ తరవాత.

"నాకు అమ్మమ్మ తోడు. నిజానికి అమ్మమ్మ లేకపోతే. ఈ నాలుగేళ్ళూ ఒంటరి తనంతో ఎల్లా గడపగలిగే దాన్నో! అమ్మమ్మ ముసలిదయినా. ఒక్కొక్కప్పుడు ఉడికినా. ఎంత సరదా మనిషి!

"పాపం అమ్మమ్మకయినా కూచోవటానికి చోటు దొరికితే బాగుండును. నాకేం. నేను ఎంతసేపయినా నుంచోగలను."

అనుకొని అటూ ఇటూ చూచింది అపర్ణ. ఎక్కడా ఖాళీలేదు. పోనీ ముసలావిడ నుంచుందని ఎవరయినా చోటిస్తారా? ఇవ్వరు.

ఇంతలో ప్రక్కనున్న ముసలాయనతో అన్నాడు ఒకతను చక్కటి 'పోజి'చ్చి.

"చూశారూ! బండి కదిలిపోతోందన్న కంగారుతో నయినాసరే, మీరు ఆడవాళ్ళ పెట్టెలోకి ఎక్కండి. వాళ్ళు వాక్‌నయన బాణపరంపరా ప్రసరణంతో మిమ్మల్ని జర్జరితాంగుల్ని చేసి, కదుల్తోన్న రైల్లోంచి అయినాసరే,- ఇంతంటే ప్రాణాలు పోవడం అయినా నయమే అనుకొని- దిగిపోయేటట్లు చేస్తారు. కాని వాళ్ళో, అసలే ఇరుకయి చస్తూ ఉంటే, వాళ్ళకోసం ప్రత్యేకించిన పెట్టెలలోకి ఎక్కక, మొగవాళ్ళ పెట్టెలలోకే ఎక్కి ఉన్నచోటుకాస్తా ఆక్రమిస్తారు. ఏం న్యాయం చెప్పండి?"

అని కళ్ళజోడు కొసల్లోంచి అపర్ణవైపు అవలోకించాడు, అభినవ సురేంద్రనాథ బెనర్జీ ననుకొనే అతను.

ఈ మాటలతో అందరి నయనాలూ అతని మీద పడ్డాయి. కాని ఆ కళ్ళు నిరసన భావాన్ని వ్యక్తీకరించలేదు. పైపెచ్చు ప్రశంసా పరిపూరితాలైనాయి.

"అంతే నాయనా! ఎవడేమనగలడు!" అన్నారు తాతగారు సమాధానంగా. కొందరు తాతగారి దగ్గఱనుంచి అతని మాటలకు ఖండన నాశించారు. వాళ్ళు ఆయన మాటలకు ఆశ్చర్యపోయారు. కాని అతనిని ప్రశంసించిన ఇతరుల నయనాలు మాత్రం తాతగారిని ప్రశంసించినాయి. ఆయన ముఖంమీదికే ప్రసరితాలైనాయి.

ఆ తరువాత ఆకళ్ళు ఏటవాలు గమనం సాగించినాయి అతి విచిత్రంగా. ఆ ఏటవాలు చూపులకు గమ్యం ఒకటే. అదే అపర్ణాదేవి అరుణిత వదనం.

అపర్ణకు పరిస్థితి ప్రతిక్షణమూ అవగాహన మౌతూనే ఉన్నది. స్థైర్యంతో అరుణాధరంపై నవ్వుఁగావిచిరు నవ్వును నిలిపింది గులాబీపై మల్లెమొగ్గను ఉంచినట్లు.

"తాతగారూ" అన్నది.

అపర్ణ ఆ పెట్టెలోకి ఎక్కినప్పటినుంచీ, కొన్ని కన్నులు దొంగతనంగానూ, కొన్ని నేత్రాలు సగం దొంగతనంగానూ ఆమెను చూస్తూనే ఉన్నాయి. ఇందాక అతను అలాగ అన్నప్పుడు ఏటవాలు గమనం సాగించి నవీ అన్నీ కలిసి ఇప్పుడు నిటారు గమనం చిత్తగించి నాయి ఈ సంబోధనతో.

"తమ దేవూరండీ?" కొనసాగించింది అపర్ణ నమ్రతతో.

"మాది అనకాపల్లి అమ్మా.

"ఏది ఈ అనకాపల్లేనా? అయితే మీకు పిల్ల లెందరూ?"

"ఇద్దరు తల్లీ"

"మనుమరాళ్ళెందరండీ?"

ముగ్గురమ్మా! అందులోనూ మా పెద్ద మనుమ రాలుంది చూశావూ, అది భలేదిలే! అచ్చు నీలాగే ఉంటుంది. దానికి నేనంటే ఎంత ఇదను.... ..."

"-అయితే తాతగారూ, ఆ మీ మనుమరాలు మీతో ఇప్పుడు ప్రయాణంచేస్తూ ఉన్నదనుకోండి కొంచెంసేపు నేనే ఆ మీమనుమరాలు ననుకోండి. అప్పుడు ఆయ నన్న మాటలకు మీ రామాటలను జోడించి ఉండేవారా? ఆడపిల్లలనుగన్న మీరు, ఆయన మాటలను కాదన వలసిందిపోయి, పెద్దతనానికి సిగ్గుచేటుగా 'భళీ'అనటం, ఏమయినా, మీ మనస్సుకయినా, సమంజసంగా కనపి స్తోందేమో, ఒక్కసారి ఆలోచించండి.''

అపర్ణనోటినుండి ఒక్కొక్క వాక్యమూ వెలువడుతూ ఉంటే ప్రశంసా భావాన్ని ప్రకటించిన ప్రతి ఒక్కరి తలకాయా, ఒక్కొక్క పావు అంగుళం చొప్పున అధోగమనం అంగీకరించింది.

"ఏం మిష్టర్!"

అన్న ఈ అపర్ణ సంబోధన అక్కడి వాళ్ళమీద విద్యుదాఘాతంలా పనిచేసింది.

"మీకూ సిస్టర్సు ఉండి ఉంటారు- ఇప్పుడు మీకు పెళ్ళి కాకపోయినా, ముందయినా చేసికొంటారుగా. మీవాళ్ళు ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు ఇలాగెవరయినా అంటే మీ మనసుకెలా ఉంటుందీ?

"ఆడవాళ్ళు మొగవాళ్ళ పెట్టెలోకి ఎక్కడం సరదా కోసమేనా?

"మిమ్మల్ని చూస్తే, చదువుకొన్నవారో, చదువు కొంటూన్నవాళ్ళో అనిపిస్తోన్నది. మన చదువుకు ప్రయో జనం మంచి నడవడి అలవడటం కాకపోతే, ఆ చదు వుకు సార్థక్యం ఏముంది చెప్పండి.

"చదువుకొన్నవాళ్ళ స్థితే ఇలా ఉంటే ఇక చదువు కోనివాళ్ళ నని ఏం ప్రయోజనం? నిజానికి ఇలాంటి జబ్బు చదువుకొన్న వాళ్ళలోనే ఎక్కువగా కనిపిస్తోన్నదే.

"నేనిలా అన్నందుకు నామీద మిరియాలూ కారాలూ నూరకండి. నే నన్న మాటల్లో సామంజస్యం ఉందో లేదో ఆలోచించండి.

"నిజానికిది చాలా చిన్న విషయం. కాని ముల్లులా బాధిస్తుంది ఎదుటివాళ్ళని-

"గుడ్‌బై! నేను దిగవలసిన స్టేషను వచ్చేసింది!"

అని 'కంకరరాతి' దెబ్బకు 'మెషిన్‌గన్' తో జవా బిచ్చింది.

అమ్మమ్మా, అపర్ణా దిగిపోయినారు.

బరువుగా నిట్టూర్చింది బండి. వాళ్ళు దిగిన కాస్సేప టికే ఆ 'మిష్ట'రూ దిగిపోయినాడు.

• • •

అపర్ణ ఇంటికి వచ్చినాక తన యీ ప్రయాణానికి కారణం, ఇదివరకటిలాగ, వడ్లగింజలో బియ్యపుగింజ కాదని తెలుసుకొన్నది.

నాన్నగారి వాదము ఆమెకూ సమ్మతమే అయింది. తనకూ మరి మూడు నెలల్లో బి.ఏ. పూర్తి అవుతుంది, తను ఉద్యోగం చేయవలసిన అవసరం ఎలాగాలేదు.

"ఆయన బి.ఏ. అనర్సట. బాగానే ఉంటాడట. మిగిలిన అవసరమయిన అర్హతలూ గలవాడట. సాంప్రదాయకమయిన కుటుంబమట. 'ఈ సంబంధం తప్పితే ఇంత అనుకూలమయిన సంబంధం మరొకటిలేదు నా దృష్టిలో. వాళ్ళ కుటుంబ విషయాలన్నీ నాకు బాగా తెలుసు. అతని మేనమామ ప్రస్తుతం ఈ ఊళ్ళోనే ఉంటున్నారు. రేపే వస్తారు చూసుకోవటానికి. పరస్పరం చూసుకొన్నాక, అనురూపమూ, అనుగుణమూ అన్నీ అంగీకారం అయితేనే చేసుకోవచ్చు" అనికూడా అన్నారు నాన్నగారు. ఇందులో కాదనదగింది ఏముంది ?" అనుకొన్నది అపర్ణ.

మఱునాడు కాబోయే పెండ్లికొడుకూ, అతని తండ్రీ, తల్లీ, మేనమామ, మేనత్తా వచ్చారు.

అపర్ణ అపర అపర్ణాదేవిలా అలంకరించబడింది. తల్లి, పెద్దలు కూర్చొన్న హాలులోనికి అపర్ణను తీసుకొనివచ్చి, పెండ్లి కొడుకు కూర్చొన్న కుర్చీకి ఎదుటి కుర్చీలో కూర్చోబెట్టింది.

పెండ్లి కొడుకును పెండ్లి కూతురూ, పెండ్లి కూతురును పెండ్లి కొడుకూ చూచుకొన్నారు.

ఆ నాలుగు కన్నులూ నీలాషాఢపయోదాలే అయితే, మధ్యనుండి విద్యుత్తు పుట్టేదే.

ఎందుచేతో ఇద్దఱి ముఖాలలోనూ కొద్దిపాటి తెల్లదనం కానుపించింది.

దానికి కారణం తెలిసిన మూడో వ్యక్తి బహుశః గుమ్మందగ్గఱ నిలబడి ఉన్న అమ్మమ్మ కావచ్చు.

"నిన్నటి మెయిల్లో రావటం వాల్తేరునుంచి అన్నమాట ఈయన"

అనుకొన్నది అపర్ణ.

---


## శరీర సౌందర్యముపై ప్రసంగము

మీ శరీరచ్ఛాయను యౌవనవంతముగాను, ఆరోగ్యవంతముగాను ఉంచుటకు వ్యాయామము, పరిశుభ్రమైనగాలి ముఖ్యావసరములు.

కాని మీ చర్మమును పైగా జాగ్రత్తపరచుకొనుట అవసరము

## మైసూరు సేండల్ సబ్బు

ప్రశస్తమైన సరకులతో తయారుకాబడినది.

చర్మమును శుభ్రపరచి, శరీరమునకు కాంతిని ఇచ్చును.

నేడే వాడి చూడండి

# మైసూర్ సేండల్ సబ్బు

శరీర సౌందర్యమునకు ముఖ్యావసరము

ఎన్నికగన్న అన్ని షాపులలోనూ లభించును

## గవర్నమెంటు సోపు ఫేక్టరీ

బెంగుళూరు